RNI NO.TELTEL/2023/87655

# దీక్ష ప్రభ

తెలుగు దినపత్రిక
29-03-2026
ఆదివారం, హైదరాబాద్
సంపుటి: 03 । సంచిక: 360
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్
FOLLOW:



పశ్చిమాసియా ఉద్రిక్తతలను భారత్ పూర్తి శక్తితో

## ఎదుర్కొంటోంది

2





## అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం

### అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి

- 2014 జూన్ నుంచి మైనింగ్‌పై విచారణకు ఆదేశిస్తున్నట్లు అసెంబ్లీలో ప్రకటన
- ఇసుక మాఫియా, అక్రమాలకు పాల్పడింది బీఆర్ఎస్ నేతలు, వారి బంధువులే
- సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక మాఫియాపై విచారణ జరిపిస్తాం
- సంతోష్‌రావు, ఆయన తండ్రి రవీందర్‌రావుపై విచారణకు ప్రభుత్వం సిద్ధం
- వద్దిరాజు రవిచంద్ర వంటివారిని బెదిరించి దారిలోకి తెచ్చుకున్నారు
- హరీశ్‌రావు తమ్ముడు మహేశ్వర్‌రావు ఇసుక మాఫియా నడిపారు
- అతడి అక్రమాల వల్లే కేటీఆర్ మైనింగ్ శాఖను తీసుకున్నారు
- విచారణలో నిజాలు నిగ్గు తేల్చి శాసనసభలో నివేదిక పెడతాం
- మెట్రో విస్తరణకు అసెంబ్లీ తీర్మానం

పద్దులపై చర్చలో భాగంగా అసెంబ్లీలో మైనింగ్ అంశం తీవ్ర దుమారం రేపింది. గనుల అంశంపై హరీశ్‌రావు మాట్లాడుతూ మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించా రు. పొంగులేటిని ఉద్దేశిస్తూ హరీశ్‌రావు చేసిన వ్యా ఖ్యలపై మండిపడిన మంత్రులు పదేళ్ల అక్రమాలను ప్ర స్తావించారు. బీఆర్ఎస్ సభ్యులు వెల్‌లో బైఠాయించి నినాదాలు చేపట్టగా ఈ క్రమంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకున్నారు. 2014 జూన్ 2 నుంచి అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్ర కటించారు.

2


## నియోజకవర్గాల పునర్విభజనతో ఒత్తిడిలో రేవంత్‌రెడ్డి



- దక్షిణాది, ఉత్తరాది అంటూ ప్రాంతీయ విద్వేషాలు రగిలించే ప్రయత్నం చేస్తున్నారు
- సీఎం భాషను చూసి తెలంగాణ సమాజం అసహ్యించుకుంటోంది
- దక్షిణాదికి జరిగే నష్టం ఏమిటో సీఎం ఇప్పటికీ చెప్పలేదు
- అన్ని రాష్ట్రాలకు 50 శాతం పెంచుతున్నపుడు అన్యాయం ఎలా జరుగుతుంది?
- ఆరు గ్యారంటీలను అమలు చేయలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఈ డ్రామాలు
- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్

2

## మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలి



### రాఘవ కన్‌స్ట్రక్షన్స్ పొంగులేటిదే..

- రేవంత్‌రెడ్డివి పచ్చి అబద్ధాలు
- భార్య, కొడుకు, తమ్ముడు దూరపు బంధువులు ఎలా అవుతారు
- కాంగ్రెస్ సర్కార్, డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతుంది
- అక్రమాలపై ప్రశ్నిస్తే డొంకతిరుగుడు సమాధానాలు చెబుతోంది
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి

'నేను తప్పు మాట్లాడితే నన్ను ఉరి తీయండి. శాసనసభ్యుడిగా సస్పెండ్ చేయండి. లేదంటే ఖజానా కొల్లగొడుతున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మీద చర్యలు తీసుకోండి' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు సవాల్ విసిరారు. శనివారం అసెంబ్లీలో మైనింగ్ శాఖ డిమాండ్స్ మీద జరిగిన చర్చలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కంచె చేను మేసిన చందంగా.. మైనింగ్ డిపార్ట్‌మెంట్ అనేది ప్రభుత్వానికి నాన్-టాక్స్ రెవెన్యూ తెచ్చిపెట్టే అత్యంత కీలకమైన శాఖ అని.. ఇలాంటి శాఖలో అధికారులు, ప్రభుత్వం ఎంత జాగ్రత్తగా పని చేస్తే ఖజానాకు అంత డబ్బు వస్తుంని.. ఆ నిధులతో అభివృద్ధి, సంక్షేమం చేపట్టవచ్చని సూచించారు. కానీ, ఇవాళ మైనింగ్ శాఖలో పెద్ద ఎత్తున అవినీతి, కుంభకోణం జరుగుతున్నదని ఆరోపించారు.


2



## చిన్నారులకు 'తొలి ముద్ద' షురూ

- అంగన్‌వాడీ పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌ను ప్రారంభించిన సీఎం
- రెడీ టూ కుక్ ఫుడ్ (ఉప్మా, కిచిడీ మిక్స్)ను బ్రేక్ ఫాస్ట్‌గా అందించనున్న ప్రభుత్వం
- అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు పంపిణీ
- బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తున్నాం
- ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా.. అమలు చేయాల్సింది అంగన్‌వాడీ టీచర్లు మాత్రమే
- ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తా: సీఎం రేవంత్ రెడ్డి

2



## రాజధాని అమరావతిని ఎవరూ టచ్ చేయలేరు

- అమరావతికి చట్టబద్ధత తీర్మానాన్ని ఆమోదించిన శాసనసభ
- అమరావతి ఆంధ్రప్రదేశ్ గుండె, దేశం గర్వించేలా నిర్మాణం చేస్తాం
- అభివృద్ధి మాత్రం అన్ని ప్రాంతాలకూ విస్తరిస్తాం
- అందుకే శాశ్వత రాజధాని అమరావతి ఉండాలన్న సంకల్పంతో తీర్మానం తెచ్చాం
- శాసనసభలో మాట్లాడిన సీఎం చంద్రబాబు

2

## హైదరాబాద్‌ను కాపాడుకోవాలి

- మూసీ పునరుజ్జీవం పేరుతో పేదల జీవితాలను నాశనం చేయడాన్ని అడ్డుకోవాలి
- అవినీతి గురించి ప్రశ్నిస్తే సీఎం రేవంత్‌రెడ్డి బెదిరింపులకు దిగుతున్నారు
- అలాంటి బెదిరింపులకు బీఆర్ఎస్ ఎప్పటికీ భయపడదు
- ఇచ్చిన హామీల అమలుకు ఒక్క రూపాయి లేదని చెప్తారు
- మూసీ పేరిట లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేస్తానని ప్రకటించడం దారుణం: కేటీఆర్

2



## బీసీలకు అన్యాయం చేసిందే బీఆర్ఎస్ పార్టీ

- పోలీసులకు ఇన్నోవాలు సమకూర్చడమే సంక్షేమమా
- వారి సంక్షేమానికి నిజమైన చిత్తశుద్ధితో మా ప్రభుత్వం పనిచేస్తోంది
- రవాణా శాఖలో పారదర్శకత కోసం టెక్నాలజీ ఆధారిత విప్లవాత్మక సంస్కరణలు తెచ్చాం
- మంత్రి శ్రీధర్ బాబు

2



# ఎమ్మెల్యేల వినతులపై యాక్షన్ ప్లాన్ సిద్ధం

- ప్రజాప్రతినిధుల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- పెరిగిన రద్దీకి అనుగుణంగా ఆర్టీసీలో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తాం
- బస్టాండ్ల అభివృద్ధికి ఎమ్మెల్యేలు తమ నిధుల నుంచి సహకరించాలి
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం అమలుతో పెరిగిన రద్దీకి అనుగుణంగా ఆర్టీసీలో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఉమ్మడి జిల్లాల వారీగా ఆర్టీసీ సమస్యలపై నిర్వహిస్తున్న ముఖాముఖి సమావేశాల్లో భాగంగా మూడో రోజు శనివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు అందజేసిన వినతులపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. కొత్త బస్సులు, కొత్త రూట్ల కేటాయింపుతో పాటు బస్టాండ్‌లో టాయిలెట్స్ వంటి కనీస వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రజాప్రతినిధుల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. బస్టాండ్ల అభివృద్ధికి ఎమ్మెల్యేలు తమ నిధుల నుంచి సహకరించాలని కోరారు.

**ఎమ్మెల్యేల ప్రధాన విన్నపాలు..**

కరీంనగర్ ఉమ్మడి జిల్లా: చెన్నూరులో బస్టాండ్ అభివృద్ధి, సింగరేణి ఏరియాలో అదనపు రూట్లు కావాలని మంత్రి వివేక్ వెంకటస్వామి కోరారు. కోరుట్ల, మెట్‌పల్లి బస్టాండ్ల ఆధునీకరణతో పాటు హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు కావాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ విన్నవించారు. వేములవాడకు అన్ని జిల్లాల నుంచి కనెక్టివిటీ పెంచాలని విప్ ఆది శ్రీనివాస్ కోరగా, పెద్దపల్లి డిపో పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే విజయరమణారావు కోరారు. హుజూరాబాద్‌లోని కమలాపూర్ బస్టాండ్‌కు అదనపు నిధులు, రామగుండంలో సిటీ బస్సులు పునరుద్ధరించాలని కౌశిక్ రెడ్డి, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ కోరారు.

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా: ఆసిఫాబాద్ పాత బస్టాండ్ పునరుద్ధరణ, గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు పెంచాలని ఎమ్మెల్యే కోవా లక్ష్మి కోరారు. బాసర బస్టాండ్‌ను పుష్కరాల లోపు ఆధునీకరించాలని రామారావు పటేల్, ఖానాపూర్ నుంచి ఆదిలాబాద్, హైదరాబాద్‌కు సర్వీసులు పెంచాలని వెడ్మ బొజ్జు విన్నవించారు. ఇచ్చోడ బస్టాండ్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు.

ఖమ్మం ఉమ్మడి జిల్లా: దమ్మపేట బస్టాండ్ పనులు త్వరగా చేపట్టాలని ఎమ్మెల్యే ఆది నారాయణ, మణుగూరు సింగరేణి ప్రాంతానికి అదనపు బస్సులు కేటాయించాలని పాయం వెంకటేశ్వర్లు కోరారు. సరిహద్దు నియోజకవర్గమైన వైరాకు అంతర్రాష్ట్ర సర్వీసులు పెంచాలని రాందాస్ నాయక్ విన్నవించారు. ఈ సమావేశంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఉన్నతాధికారులు మరియు ఆయా జిల్లాల ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** బ్లాక్‌మెయిలింగ్‌కు తమ ప్రభుత్వం భయపడేది లేదని.. ఇలాంటి బ్లాక్‌మెయిల్ ఎక్కడైనా జరగచ్చు కానీ తమ దగ్గర నడువవు అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం మైనింగ్ డిమాండ్స్‌పై చర్చలో భాగంగా హరీశ్‌రావు మాట్లాడిన అనంతరం రేవంత్‌రెడ్డి ఆయనకు కౌంటర్ ఇచ్చారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని భయపెట్టి అక్రమ పనులు చేయించుకోవాలని బీఆర్ఎస్ నేతలు చూస్తున్నారని.. ఆయన ఒప్పుకోకపోవడం వల్లనే అనవసర ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఎక్కడ రాష్ట్ర ఆదాయానికి గండిపడినా.. రాష్ట్ర ఖనిజ సంపద, ఇతర ప్రభుత్వ ఆదాయానికి గండిపడే ఎలాంటి తప్పిదాలు జరిగినా తమ ప్రభుత్వం ఉపేక్షించే ఆలోచన చేయలేదని అన్నారు. నేడు ప్రతిపక్ష సభ్యులు రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించి ఆరోపణలు లేవనెత్తారని.. కానీ, ఈ సంస్థకు నోటీసులు ఇచ్చింది.. దీనికి సంబంధించి చర్యలు తీసుకోమన్నదే తమ ప్రభుత్వమని చెప్పారు. అంతేకాకుండా సీనరేజీ చార్జి కింద రూ.1,52,97,825, పర్మిట్ ఫీజు కింద రూ.1,22,25,446 రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్ నుంచి పన్నులు కట్టించామని వెల్లడించారు. బీఆర్ఎస్ సభ్యులు మంత్రి పేరు తీసుకొని అనవసర ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఇది వారు కనిపెట్టి, వారు ఫిర్యాదు చేస్తే తాము చర్యలు చేపట్టలేదని తెలిపారు. తమ ప్రభుత్వమే దీనికి సంబంధించిన వివరాలు సేకరించి.. ఆ సంస్థకు నోటీసులు ఇచ్చి.. బకాయిలు వసూలు చేశామని చెప్పారు. అనుమతులను కూడా పరిశీలించి.. చర్యలు తీసుకోవాలని తామే ముందుకు వచ్చామన్నారు. కానీ, ఇందులో ఎవరూ ఎలాంటి ఫిర్యాదులు చేయలేదన్నారు. వివాదం లేవనెత్తాలని.. మంత్రి మీద బురదజల్లాలని.. అక్కసు వెల్లగక్కుతున్నారని అన్నారు. వారు అనుకున్న పైరవీలకు మంత్రి సహకరించడం లేదని.. మంత్రి మీద ఒత్తిడి తీసుకురావాలని.. మంత్రిని బ్లాక్‌మెయిల్ చేయాలని వారంతా ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. పర్యావరణ శాఖకు ఫిర్యాదు చేసిందే తమ ప్రభుత్వమని తెలిపారు.

**మా మంత్రికి సంబంధం ఉంటే నోటీసులు ఎందుకు ఇస్తాం..**

'మా మంత్రులకు ఇందులో పాత్ర ఉంటే.. ఈ నోటీసులు ఇవ్వడం కానీ, పన్నులు వసూలు చేయడం కానీ చేస్తామా' అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌లో తమ మంత్రికి ప్రత్యక్షంగా సంబంధం ఉంటే.. ప్రభుత్వ ఆదాయాన్ని రాబట్టుకునే ప్రయత్నం ఏ ప్రభుత్వం అయినా చేస్తుందా అని నిలదీశారు. వాళ్ల ప్రభుత్వం ఎప్పుడైనా చేసిందా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎక్కడ కూడా గండిపడకూడదని ప్రతి రూపాయి ఖజానాకు చేరాలని తమ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని చెప్పారు.

**మైనింగ్ లీజులు, అక్రమాలపై సీబీసీఐడీ విచారణ..**

బీఆర్ఎస్ వాళ్లు విచారణ కావాలని అడుగుతున్నారని.. అసెంబ్లీ వేదికగా ప్రతిపక్షానికి, ప్రజలకు మాట ఇస్తున్నానని సీఎం రేవంత్ చెప్పారు. విచారణకు ఆదేశించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని తెలిపారు. 'నాడు సిరిసిల్ల నియోజకవర్గంలో నేరెళ్లలో ఇసుక బాధితులు దళితులను లారీ ఎక్కించి, తొక్కించి చంపి ఇసుక అక్రమ రవాణా చేసిన సంతోష్‌రావు, ఆయన తండ్రి రవీందర్‌రావుకు చెందిన నేరెళ్ల ఇసుక మాఫియా మీద విచారణ చేయడానికి మా ప్రభుత్వం సిద్ధం ఉంది. అలాగే.. సర్వే 168 శిరీష జియో గ్రానైట్స్‌కు సంబంధించి ఏపీకి చెందిన మాజీ ఎమ్మెల్యేను బెదిరించి గతంలో మైనింగ్ శాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి అక్రమంగా మైనింగ్ లీజును రాయించుకున్నారు. అక్రమంగా మైనింగ్ చేశారని.. దీని మీద విచారణకు సిద్ధం. అదేవిధంగా మిడ్వెస్ట్ గ్రానైట్స్‌కు సంబంధించి నేడు రెవెన్యూ మంత్రిని బ్లాక్ మెయిల్ చేసే ప్రయత్నం చేస్తున్న ఎమ్మెల్యేకు చెందిన తమ్ముడు ఇల్లీగల్‌గా మైనింగ్ చేసుకున్నాడు. ఇందులో జరిగిన దోపిడీపై మిడ్వెస్ట్ గ్రానైట్స్ మీద విచారణకు ఆదేశిస్తాం. అలాగే, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, వారి కుటుంబసభ్యులకు చెందిన శ్వేత గ్రానైట్స్‌లో అక్రమ మైనింగ్ జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికనే కాకుండా ఈడీ విచారణ సైతం జరుగుతోంది. శ్వేత గ్రానైట్స్‌కు సంబంధించి ఇల్లీగల్ మైనింగ్‌పైనా విచారణకు ఆదేశించడానికి సిద్ధంగా ఉన్నా. అలాగే.. ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు చెందిన గాయత్రి గ్రానైట్స్ అక్రమంగా రాయించుకున్నారు. ఈ అక్రమ మైనింగుల మీద విచారణ వేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం' అని వివరించారు. హరీశ్‌రావు సొంత తమ్ముడు మహేశ్‌రావు దోపిడీకి పాల్పడ్డారని.. హరీశ్‌రావు మంత్రిగా దోచిపెట్టారని ఆరోపించారు. వీటన్నింటి మీద సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. అందరి నిగ్గుతేలుస్తానని హెచ్చరించారు. రాష్ట్రాన్ని కొల్లగొట్టిందే బీఆర్ఎస్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లు హరీశ్‌రావు, ఐదేళ్లు కేటీఆర్ ఈ శాఖను నిర్వహించి వేల కోట్ల రూపాయలను కొల్లగొట్టారన్నారు. ఇసుక మాఫియాను నడిపి దోపిడీకి పాల్పడ్డారన్నారు. తాము పెంచిన ఆదాయం కళ్ల ముందు ఉన్నదని తెలిపారు. ఇసుకకు సంబంధించి 202425లో రూ.721 కోట్ల ఆదాయం ఉంటే.. 202526లో రూ.972 కోట్లకు పెంచామన్నారు. ఇసుక దోపిడీకి పాల్పడి ఇంకా కన్‌స్ట్రక్షన్ కుంటుపడిందని.. రియల్ ఎస్టేట్ దెబ్బతిన్నదని అంటున్నారని అన్నారు. రియల్ ఎస్టేట్ దెబ్బ తింటే తాము ఇసుకను ఏమైనా బుక్కుతున్నామా..? బిర్యానీ వండుకొని తింటున్నామా..? అని ప్రశ్నించారు. ఏడాదికి రూ.1,000 కోట్లను కేవలం ఇసుక దందాలోనే హరీశ్‌రావు, కేటీఆర్ దోపిడీకి పాల్పడ్డారని.. ఈ మాఫియాకు నాయకత్వం వహించిందే వీరని పేర్కొన్నారు. మొదట్లో ఈ శాఖ హరీశ్‌రావు దగ్గర ఉండేదని.. ఆయన అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నారని కేసీఆర్ ఆ శాఖను తొలగించారని అన్నారు. ఈ విషయంలో కొడుకు, అల్లుడు మధ్య పంచాయితీ పడితే దానిని తెంపడానికి ఆ శాఖను కేటీఆర్ దోచుకునేందుకు అవకాశం ఇచ్చారని ఆరోపించారు. జూన్ 2, 2014 నుంచి ఇప్పటివరకు మైనింగ్ లీజుల మీద, జరిగిన అక్రమాల మీద, ఆయా అక్రమ మైనింగుల మీద పూర్తిస్థాయిలో సీబీసీఐడీతో విచారణ జరిపించి.. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో పూర్తి నివేదికను ప్రవేశపెడుతామని స్పష్టం చేశారు. గత పదేళ్లు వారు పాల్పడిన దోపిడీ బయట పడుతున్నదని.. అందుకే ఈ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్ అన్నారు. ఏ బురద జల్లినా ఇక్కడ భయపడే వారు ఎవరూ లేరని స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌ను కాపాడుకోవాలి

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** తన స్కాములు, అవినీతి గురించి ప్రశ్నిస్తే సీఎం రేవంత్‌రెడ్డి బెదిరింపులకు దిగుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం విస్తృతస్థాయి సమావేశానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మైనింగ్ అక్రమాలను ప్రశ్నిస్తే ప్రతిపక్షాన్ని బెదిరించే ధోరణి ప్రదర్శించారని అన్నారు. సీఎంకు బెదిరింపులు అలవాటైపోయాయని, అలాంటి బెదిరింపులకు బీఆర్ఎస్ ఎప్పటికీ భయపడదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు ఒక్క రూపాయి లేదని చెప్పే సీఎం, అవినీతి సొమ్ము కోసం మూసీ పేరిట లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేస్తానని ప్రకటించడం దారుణమని అన్నారు. అంచనాలను అనవసరంగా పెంచి అవినీతికి మార్గం సుగమం చేస్తున్నదని విమర్శించారు. మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షలాది ఇళ్లను కూల్చివేయడానికి, దాదాపు 3 వేల ఎకరాల భూమిని సేకరించి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రయత్నం జరుగుతున్నదని ఆరోపించారు. ఒకవైపు మూసీ ఒడ్డున ఉన్న ఇళ్లు చట్ట విరుద్ధమని చెప్పే ప్రభుత్వం, అదే ప్రాంతంలో భారీ హోటళ్లు, బిజినెస్ సెంటర్లు నిర్మించాలనుకోవడం ద్వంద్వ వైఖరి అని అన్నారు. తాను చేస్తున్న అవినీతిని ప్రశ్నిస్తే శివతాండవం చేస్తానంటూ సీఎం మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనమని అన్నారు. హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉన్నదని, మూసీ పునరుజ్జీవం పేరుతో పేదల జీవితాలను నాశనం చేయడాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలి

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** 'నేను తప్పు మాట్లాడితే నన్ను ఉరి తీయండి. శాసనసభ్యుడిగా సస్పెండ్ చేయండి. లేదంటే ఖజానా కొల్లగొడుతున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మీద చర్యలు తీసుకోండి' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు సవాల్ విసిరారు. శనివారం అసెంబ్లీలో మైనింగ్ శాఖ డిమాండ్స్ మీద జరిగిన చర్చలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కంచె చేను మేసిన చందంగా.. మైనింగ్ డిపార్ట్‌మెంట్ అనేది ప్రభుత్వానికి నాన్‌టాక్స్ రెవెన్యూ తెచ్చిపెట్టే అత్యంత కీలకమైన శాఖ అని.. ఇలాంటి శాఖలో అధికారులు, ప్రభుత్వం ఎంత జాగ్రత్తగా పని చేస్తే ఖజానాకు అంత డబ్బు వస్తుందని.. ఆ నిధులతో అభివృద్ధి, సంక్షేమం చేపట్టవచ్చని సూచించారు. కానీ, ఇవాళ మైనింగ్ శాఖలో పెద్ద ఎత్తున అవినీతి, కుంభకోణం జరుగుతున్నదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతున్నదన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున, నగరాన్ని ఆనుకునే పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ వ్యాపారాలు జరుగుతున్నాయని.. రక్షకుడే భక్షకుడిగా మారితే ఏం జరుగుతుందో.. అలాంటి పరిస్థితే ఇవాళ రాష్ట్రంలో దాపురించిందని పేర్కొన్నారు. జీవో 111 ఉల్లంఘిస్తూ రూల్స్, పర్మిషన్స్ లేకుండా దర్జాగా దందాలు జరుగుతున్నాయని ఆరోపించారు. శంషాబాద్ మండలం కోత్వాల్‌గూడ గ్రామంలో (సర్వే నెంబర్ 62, 63) ఎలాంటి కాలుష్య పరిశ్రమలు పెట్టకూడదని నిబంధనలు ఉన్నాయని.. కానీ, అక్కడ రాఘవ కన్‌స్ట్రక్షన్స్ భారీ స్టోన్ క్రషర్‌ను డీజిల్ జనరేటర్లపై యథేచ్ఛగా నడుపుతున్నదని పేర్కొన్నారు. ఇది పొంగులేటిదేనని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పారని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భార్య, కొడుకు, తమ్ముడు దూరపు బంధువులు ఎలా అవుతారని ప్రశ్నించారు. రాఘవ పేరు స్వయాన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తండ్రిపేరని, ఆ కంపెనీ ఆయనదేనని లోకమంతా తెలుసని వ్యాఖ్యానించారు.



సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీని తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కార్, డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతూ.. అక్రమాలపై ప్రశ్నిస్తే డొంకతిరుగుడు సమాధానాలు చెబుతోందని ఆక్షేపించారు.ఈ ప్రభుత్వం తెచ్చిన జీవో 26 ప్రకారం స్టోన్ క్రషర్ పెట్టాలంటే మినరల్ డీలర్ లైసెన్స్ ఉండాలని.. ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి సీఎఫ్ఈ, సీఎఫ్ఓ సర్టిఫికెట్లు తీసుకోవాలని.. ఇందులో ఏ ఒక్క నిబంధన కూడా రాఘవ కన్స్ట్రక్షన్స్ పాటించలేదని ఆరోపించారు. ఎలక్ట్రిసిటీ కనెక్షన్ లేకుండా డీజిల్ జనరేటర్ల మీద ఎందుకు నడపవలసి వస్తున్నదని ప్రశ్నించారు. దీనికి సంబంధించి మే 21, 2025న మైనింగ్ డైరెక్టర్ జనరల్ స్వయంగా ఈ క్రషర్‌పై తనిఖీకి ఆదేశించారని.. రెవెన్యూ, పీసీబీ, ఎస్‌పీడీఎల్, మైనింగ్ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి 5,130 మెట్రిక్ టన్నుల అక్రమ రఫ్ స్టోన్ నిల్వలను పట్టుకున్నారని తెలిపారు. అలాగే.. ఫిబ్రవరి 13, 2026న డిమాండ్ నోటీసు ఆదేశించారని.. కానీ, రాఘవ కన్స్ట్రక్షన్స్ సంస్థ అసలు పట్టించుకోలేదని అన్నారు. మార్చి 4, 2026న మళ్లీ తనిఖీ చేయగా.. ఈసారి ఏకంగా 11,200 మెట్రిక్ టన్నుల ముడి సరుకు దొరికిందని.. అదేనెల 13న మరో షోకాజ్ నోటీసు ఇచ్చారని చెప్పారు. 5న ఎలాంటి అనుమతులు లేకుండా డీజిల్ జనరేటర్‌పై స్టోన్ క్రషర్ నడుపుతున్నారు, కాలుష్యానికి పాల్పడుతున్నారని స్వయంగా మైనింగ్ అధికారులే పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకి లేఖ రాశారని ఆరోపించారు. రాఘవ కన్స్ట్రక్షన్స్ రెండుసార్లు పట్టుబడినా ఈ ప్రభుత్వం మౌనంగా ఉన్నదని ప్రశ్నించారు. ప్రతిపక్షానికో న్యాయం.. మంత్రులకో న్యాయమా? అని నిలదీశారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వల్ల మూసీ నది కాలుష్యానికి, గండిపేట్, హిమాయత్‌సాగర్‌లో కాలుష్యానికి కారణం అవుతుందని లిఖితపూర్వకంగా రాశారని.. దీనికి సీఎం ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కంపెనీతో సంబంధం లేకపోతే మీరెందుకు భుజాలు తడుముకున్నారని నిలదీశారు. మంత్రి పొంగులేటి తక్షణమే నైతికంగా రాజీనామా చేసి, విచారణ ఎదుర్కోవాలని డిమాండ్ చేశారు. 'మీ దగ్గర నిజాయితీ ఉంటే, ఈ కుంభకోణంతో మీకు సంబంధం లేకపోతే.. ప్రతిపక్ష సభ్యులతో హౌస్ కమిటీ వేయండి.. లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి' అని సవాల్ విసిరారు.

# పశ్చిమాసియా ఉద్రిక్తతలను భారత్ పూర్తి శక్తితో ఎదుర్కొంటోంది

**నేషనల్ బ్యూరో, దీక్షప్రభ:** పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ప్రపంచం ఆందోళన చెందుతున్న తరుణంలో, భారత్ మాత్రం ఆ సంక్షోభాన్ని పూర్తి శక్తితో ఎదుర్కొంటోందని ప్రధాని మోడీ తెలిపారు. నిత్యావసరాల కొరత వల్ల ప్రపంచమంతా ఆందోళన చెందుతున్నా, ఆ భారం సామాన్య కుటుంబాలతోపాటు రైతులపై పడకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ మేరకు నోయిడా ఫేజ్ 1 విమానాశ్రయాన్ని శనివారం ప్రారంభించిన మోడీ, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆ కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కూడా పాల్గొన్నారు.

**డబుల్- ఇంజిన్ విధానం ద్వారా ఇది సాధ్యం..!**

"సమాజ్వాదీ పార్టీ నోయిడాను దోపిడీకి ఏటీఎంలా మార్చింది, కానీ నేడు బీజేపీ ప్రభుత్వ హయాంలో యూపీ అభివృద్ధికి చోదక శక్తిగా మారుతోంది. డబుల్ ఇంజిన్ విధానం ద్వారా ఇది సాధ్యమైంది" అని అన్నారు. 2004 నుంచి 2014 వరకు నిలిచిపోయిన విమానాశ్రయ ప్రాజెక్టును ఆలస్యం చేసినందుకు కాంగ్రెస్, సమాజ్వాదీ పార్టీలను ఆయన విమర్శిస్తూనే, చివరకు దానికి శంకుస్థాపన చేసి, కార్యరూపం దాల్చినందుకు బీజేపీ ఎన్డీఏ ప్రభుత్వాన్ని ప్రశంసించారు. "గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం, గత ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం ఈ విమానాశ్రయానికి శంకుస్థాపన చేయడానికి కూడా అనుమతించలేదు. 2004 నుంచి 2014 వరకు ఇది ఫైళ్లలోనే మరుగునపడిపోయింది. సమాజ్వాదీ పార్టీ ఉత్తర్? ప్రదేశ్లో ఏ పనీ జరగనివ్వలేదు. కానీ బీజేపీ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శంకుస్థాపన జరిగింది. ఇప్పుడు విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్నాం. అంతేకాకుండా, దేశంలోని రెండు ప్రధాన సరుకు రవాణా కారిడార్లు దాద్రీలో కలుస్తాయి, దీనివల్ల ఈ ప్రాంతానికి అనుసంధానం మెరుగుపడుతుంది" అని ఆయన అన్నారు.

"ఈ ప్రాజెక్టులన్నీ ఉత్తర్? ప్రదేశ్ అభివృద్ధికి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ప్రకాశవంతమైన ఉదాహరణ. సెమీ కండక్టర్ ఫ్యాక్టరీ భారతదేశాన్ని సాంకేతికతలో 'ఆత్మనిర్భర్' గా తీర్చిదిద్దుతోంది. మీరట్ మెట్రో, నమో భారత్ రైలు వేగవంతమైన, స్మార్ట్ కనెక్టివిటీని అందిస్తున్నాయి. ఇక నోయిడా విమానాశ్రయం ఉత్తర భారతదేశం మొత్తాన్ని ప్రపంచానికి అనుసంధానిస్తోంది," అని ప్రధాని మోదీ అన్నారు. మూ ధనమ్మకాలు, రాజకీయ భయం కారణంగా ఒకప్పుడు నోయిడా ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందని పేర్కొంటూ, ఆ ప్రాంతం ఎదుర్కొన్న గత సవాళ్లను ప్రధానమంత్రి గుర్తు చేసుకున్నారు "నోయిడాలో ఎక్కడ చూసినా ఉత్సాహభరితమైన, శక్తివంతమైన యువత కనిపిస్తోంది. ఈ ప్రాజెక్ట్ తమ భవిష్యత్తుకు కొత్త అవకాశాలు ఇస్తుందని ఈ యువతకు తెలుసు. ఈ రోజు మనం వికసిత్ యూపీ, వికసిత్ భారత్? లో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నాం. దేశంలో అత్యధిక అంతర్జాతీయ విమానాశ్రయాలు కలిగిన రాష్ట్రాల్లో ఉత్తర్? ప్రదేశ్ ఒకటిగా నిలిచింది. ఈ విమానాశ్రయానికి శంకుస్థాపన చేసి, దానిని ప్రారంభించే అవకాశం నాకు లభించినందుకు నేను చాలా సంతోషంగా ఉన్నాను. ఈ విషయాన్ని మీ అందరితో పంచుకుంటున్నాను.

# చిన్నారులకు 'తొలి ముద్ద' షురూ

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** తెలంగాణ రాష్ట్రంలోని అంగన్‌వాడీ పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ 'తొలి ముద్ద'ను ప్రభుత్వం ప్రారంభించింది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ స్కీమ్‌లో భాగంగా అంగన్‌వాడీ చిన్నారులకు రెడీ టూ కుక్ ఫుడ్ (ఉప్మా, కిచిడీ మిక్స్) ను బ్రేక్ ఫాస్ట్‌గా ప్రభుత్వం అందించనుంది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్‌కు మొబైల్ ఫోన్‌లను రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ సీతా దయాకర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం, ఈ పథకం ప్రారంభోత్సవానికి ఒక మంచి నేపథ్యం ఉందని గుర్తు చేశారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చారని, దేశంలో ప్రస్తుతం ఫుడ్ సెక్యూరిటీ ఉందని, కానీ న్యూట్రిషన్ ఫుడ్ అందడం లేదని తెలిపారు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోందని అన్నారు. ఇప్పుడు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా ప్రారంభించామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా, అమలు చేయాల్సింది అంగన్‌వాడీ టీచర్లు మాత్రమేనని, అందుకే ప్రభుత్వం వారిపై గురుతర బాధ్యత పెట్టిందని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ చిన్నారులను సొంత బిడ్డల్లా చూసుకుని, వారికి పౌష్టికాహారం అందించాలని కోరారు. అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా భావిస్తోందన్న ఆయన, ఆ శాఖ సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నామని, ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా వారి సమస్యలనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ క్రమంలోనే అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదని, సొంత భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందితేనే వారిలో మానసిక ఎదుగుదల ఉంటుందని, పౌష్టికాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని తెలిపారు. భవిష్యత్‌లో అవే అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నాయని అన్నారు. అలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి పథకాలను ప్రవేశపెట్టిందని వివరించారు.

# నియోజకవర్గాల పునర్విభజనతో ఒత్తిడిలో రేవంత్‌రెడ్డి

**కరీంనగర్, దీక్షప్రభ:** నియోజకవర్గాల పునర్విభజన, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి కేంద్రం సిద్ధమవుతుండటంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిప్రెషన్‌లోకి వెళ్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. అందుకే ప్రధానమంత్రిపై దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దక్షిణాది, ఉత్తరాది అంటూ ప్రాంతీయ విద్వేషాలు రగిలించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. శనివారం కరీంనగర్‌లో తన నివాసంపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్‌ను టీజీ రెడ్కో అధికారులు, డిస్ట్రిబ్యూటర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ''సీఎం భాషను చూసి తెలంగాణ సమాజం అసహ్యించుకుంటోంది. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి జరిగే నష్టం ఏమిటో సీఎం ఇప్పటికీ చెప్పలేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదు. అన్ని రాష్ట్రాలకు 50 శాతం పెంచుతున్నపుడు దక్షిణాదికి అన్యాయం ఎలా జరుగుతుంది? ఆరు గ్యారంటీలను అమలు చేయలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఈ డ్రామాలాడుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ పెట్టుకోవచ్చు. కవిత పార్టీ పెట్టడాన్ని స్వాగతిస్తున్నా. కాళేశ్వరం డిజైన్ లోపానికి ప్రధాన కారకుడు కేసీఆర్. ఇంజినీరు అవతారమెత్తి డిజైన్లు తయారు చేశారు. రేవంత్ ప్రభుత్వం డిజైన్ కారకులను, అవినీతి పరులను అరెస్ట్ చేయడంలేదు. కేసీఆర్‌తో రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారు'' అని సంజయ్ ఆక్షేపించారు.

# ఇంధనంపై ఆందోళన అవసరం లేదు

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి


**హైదరాబాదు, దీక్షప్రభ:** పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ సరఫరాలపై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దేశవ్యాప్తంగా సరఫరాలు సక్రమంగా కొనసాగుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం హైదరాబాదు కవాడిగూడలోని సిజిఓ టవర్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వారం రోజులుగా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో పెట్రోల్ పంపుల్లో ఇంధనం లేదనే వార్తలు, కొంతసేపు పంపులను మూసివేయడం వంటి ఘటనలతో ప్రజల్లో ఆందోళన నెలకొన్నదని తెలిపారు. అయితే ఈ పరిస్థితులు స్థానికంగా మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన యుద్ధ వాతావరణం, అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావమని పేర్కొన్నారు. పెట్రోలియం ఉత్పత్తుల విషయంలో భారత్ ఇతర దేశాలపై ఆధారపడటం వల్ల ఈ ప్రభావం కనిపిస్తోందన్నారు. ప్రస్తుతం దేశంలో ఇంధన కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా చర్యలు తీసుకుంటోందని వివరించారు. దేశీయంగా రిఫైనింగ్ సామర్థ్యాన్ని పెంచుతూ, అవసరమైన ఇంధనాన్ని అందుబాటులో ఉంచే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. విదేశాల నుంచి దిగుమతులను కూడా నిరంతరంగా కొనసాగిస్తూ సరఫరాల్లో ఎలాంటి అంతరాయం రాకుండా చూస్తున్నామని చెప్పారు. ప్రపంచ దేశాల నాయకులతో నిరంతరం చర్చలు జరుపుతూ, అవసరమైన ఇంధనాన్ని సమయానికి పొందేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైతే అధిక ధరలు చెల్లించడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దేశంలో వాహనాల సంఖ్య పెరుగుతుండటం, ప్రజల అవసరాలు మారుతుండటం వల్ల ఇంధన వినియోగం కూడా పెరుగుతోందని తెలిపారు. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తోందని, రైల్వేలను విద్యుదీకరణ దిశగా ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు. సోషల్ మీడియా ద్వారా వస్తున్న తప్పుడు ప్రచారాలు ప్రజల్లో అనవసర భయాందోళనలకు దారి తీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయిల్ కంపెనీలు ఇప్పటికే స్పష్టం చేసినట్లుగా తెలంగాణలో ఎలాంటి ఇంధన కొరత లేదని, సరఫరాలు సజావుగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మకుండా బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆయిల్ కంపెనీల అధికారులు, కేంద్ర ప్రభుత్వ విభాగాల ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బీసీలకు అన్యాయం చేసిందే బీఆర్ఎస్ పార్టీ

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** పదేళ్ల పాలనలో బీసీలకు అన్యాయం చేసిందే బీఆర్ఎస్ పార్టీ అని, బీసీల గురించి మాట్లాడే కనీస నైతిక హక్కు బీఆర్ఎస్ కు లేదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విమర్శించారు. శాసనసభ వేదికగా ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బీసీ సంక్షేమం, పోలీసు శాఖ, ఆర్టీసీ వంటి కీలక అంశాలపై చర్చ జరుగుతున్న సమయంలో బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. పోలీస్ సంక్షేమం అంటే కేవలం ఇన్నోవా కార్లు సమకూర్చడం మాత్రమే కాదని, తమ ప్రభుత్వం వారి సంక్షేమానికి నిజమైన చిత్తశుద్ధితో పని చేస్తుందని తెలిపారు. రవాణా శాఖలో పారదర్శకత కోసం టెక్నాలజీ ఆధారిత విప్లవాత్మక సంస్కరణలు తెచ్చామని, ఆర్టీసీని నిర్వీర్యం చేసిన గత ప్రభుత్వం ఇప్పుడు విమర్శలు చేయడం హాస్యాస్పదమని అన్నారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే కనీసం పలకరించని వారు ఇప్పుడు మాట్లాడుతున్నారన్నారు. రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా తమ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై ముందడుగు వేస్తుంటే, ప్రతిపక్షం ఓర్వలేక వెనక్కి లాగే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలని, ప్రభుత్వం వాటిని స్వీకరించేందుకు సిద్ధంగా ఉందని హితవు పలికారు. సభలో ముఖ్యమైన అంశాలపై చర్చ జరుగుతుంటే చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించడం బీఆర్ఎస్ సభ్యులకు అలవాటుగా మారిందని మంత్రి విమర్శించారు. "వాకౌట్ చేస్తే రోజంతా చేయాలి.. కానీ బయటకెళ్లి మళ్లీ లోపలికి రావడం ఏంటి? మీ డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారనే విషయం మర్చిపోవద్దు" అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరించారు.

# రాజధాని అమరావతిని ఎవరూ టచ్ చేయలేరు

**అమరావతి, దీక్షప్రభ:** అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. విభజన చట్టం సెక్షన్5(2)ను సవరించాలని కోరుతూ ఎట్ అమరావతి అనే పదాన్ని చేర్చాలనిఉదయం శాసనసభలో 11 గంటల 11నిమిషాలకు ముఖ్య మంత్రి చంద్రబాబు స్వయంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తెలుగువారు రాజధానులు కోల్పోవ డంతోపాటు విమర్శలు, వివక్షత అవమానాలు దశాబ్దాలుగా భరిస్తూ వస్తున్న పరిణామాలను గుర్తు చేసిన సీఎం, భవిష్యత్తు నగరంగా అమరావతి ఎలా అభివృద్ధి చెందేదీ అసెంబ్లీ సాక్షిగా ప్రజలకు వివరించారు. తీర్మానం సభ ఆమోదం పొందిన వెంటనే కేంద్ర హోంశాఖతోపాటు లోక్సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్లకు సభాపతి అయ్యన్నపాత్రుడు తీర్మానాన్ని పంపారు. ఆంధ్రప్రదేశ్ కు ఒక్కటే రాజధాని, అది అమరావతి మాత్రమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధానిని ఎవరూ టచ్ చేయలేరు, ఇంచ్ కూడా కదలదని తేల్చిచెప్పారు. అమరావతి ఆంధ్రప్రదేశ్ గుండె, ఆత్మ అని కొనియాడారు. అమరావతి అందరిదీ అనేలా దేశం గర్వించేలా నిర్మాణం చేస్తామని చంద్రబాబు తెలిపారు. అభివృద్ధి మాత్రం అన్ని ప్రాంతాలకూ విస్తరిస్తామన్నారు. ప్రజలందరికీ మేలు జరుగుతుందనే ఉద్దేశంతోనే రాష్ట్రానికి నట్టనడుమ ఉన్న అమరావతి రాజధానిగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరే తీర్మానంపై శాసనసభలో ఆయన మాట్లాడారు. 201419 మధ్య ప్రతిపక్ష నేతగా అమరావతికి బేషరతుగా మద్దతు ఇచ్చిన జగన్, అధికారంలోకి వచ్చాక ఊసరవెల్లి రాజకీయాలు చేశారని మండిపడ్డారు. మూడు రాజధానులంటూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసే కుట్రకు తెర తీశారని దుయ్యబట్టారు.



# భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ పున ప్రతిష్ట

- అంబేద్కర్ విగ్రహానికి మార్బుల్స్ గ్రానైట్ స్పాన్సర్ చేసిన
- టిడిపి పార్టీ సీనియర్ నాయకుడు తాటిపాటి అయ్యన్నకు ఘన సన్మానం



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు నియోజవర్గం పాములపాడు మండలం తుమ్మలూరు గ్రామంలో, ప్రపంచ మేధావి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం పున ప్రతిష్ట చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా,టిడిపి సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, జి రామ లింగేశ్వర రెడ్డి,చంద్రమౌళి, వేల్పుల ఆనంద్ ఐ ఆర్ ఎస్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం పున ప్రతిష్టకు అంబేద్కర్ విగ్రహానికి మార్బుల్స్ గ్రానైట్స్ స్పాన్సర్ చేసిన టిడిపి సీనియర్ నాయకుడు తాటిపాటి అయ్యన్నకు తుమ్మలూరు గ్రామం టిడిపి సీనియర్ నాయకుడు రామలింగేశ్వర్ రెడ్డి, మరియు వేల్పుల ఆనంద్ కుమార్ ఐఆర్ఎస్ చేతుల మీదుగా శాలువాతో, పూలదండ వేసి ఘనంగా సన్మానం చేశారు. టిడిపి సీనియర్ నాయకుడు తాటిపాటి అయ్యన్న మాట్లాడుతూ, భారత రాజ్యాంగం రాశి దేశ మానవాళికి హక్కుల గురించి తెలియజేసిన మహానుభావుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. నన్ను సన్మానించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు అని టిడిపి సీనియర్ నాయకుడు తాటిపాటి అయ్యన్న తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అతిరథ మహారధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జై కిసాన్ పార్కులో ప్రపంచ రంగస్థల కళాకారుల దినోత్సవం ఘనంగా

**ముఖ్యఅతిథిగా టిడిపి సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి**



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు పట్టణంలోని జై కిసాన్ పార్క్‌లో నిర్వహించిన ప్రపంచ రంగస్థల కళాకారుల దినోత్సవం సందర్భంగా, నందికొట్కూరు తాలూకా రంగస్థల కళాకారుల ఆహ్వానం మేరకు టిడిపి సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన కళాకారులను శాలువాలతో,పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ..ప్రతి ఒక్కరిలో ప్రత్యేకంగా నైపుణ్య ధోరణిలో ఒక కళ అనేది ఉంటుంది. వారి ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించినప్పుడే వారు భయాన్ని వదిలి వారి ప్రతిభతో ముందుకు వస్తారని అటువంటి వారికి సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని అని అన్నారు. అటువంటి కళాకారులను ఈరోజు సన్మానించడం ఎంతో ఆనందంగా ఉంది అని టిడిపి సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన అనేక మంది కళాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# తండ్రి మరణం...కన్నీటితో పది పరీక్ష రాసిన కొడుకు



**నర్సింహులపేట,దీక్ష ప్రభ:** ఒక వైపు కన్నతండ్రి భౌతికకాయం ఇంట్లో ఉండగానే.. మరోవైపు తన భవిష్యత్తు కోసం ఆ విద్యార్థి కన్నీటి పర్యంతమవుతూ పదోతరగతి పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఈ హృదయ విదారక ఘటన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పడమటిగూడెం గ్రామానికి చెందిన నాయిని ఉప్పలయ్య (45) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. కుమారుడు నాయిని శివకృష్ణ శనివారం గణితం పరీక్ష ఉండటంతో మండలంలోని ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రానికి హాజరై పరీక్ష రాశాడు. పరీక్ష పూర్తవగానే తన తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు.ఈ విషాదకర సంఘటన ప్రతి ఒక్కరినీ కలిచివేస్తోంది.ఇది చూసిన స్థానికులు, ఉపాధ్యాయులు కంటతడి పెట్టారు.

# అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది

**నర్సింహులపేట,దీక్ష ప్రభ:** అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని మండల యూత్ ఉపాధ్యక్షుడు ఓరుగంటి శ్రీకాంత్ రజక అన్నారు. శుక్రవారం మండలంలోని కౌసల్యదేవిపల్లి జిపిలో శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా శ్రీ సీతారామ స్వామి కళ్యాణం నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాసమల్ల మల్లేష్, నాయకులు గండి వెంకన్న, గంగదరి సత్తయ్య, అన్నంగి నరేష్, నవీన్, గొట్టిముక్కల మోహన్ రెడ్డి, నరసింహారెడ్డి, వార్డ్ సభ్యులు కొత్త వెంకటయ్య, కేతమ్మ సుబ్బారావు, సత్తిరెడ్డి,బత్తిని శీను తదితరులు పాల్గొన్నారు.




# శ్రీశ్రీశ్రీ రంగనాథ స్వామి జాతరకు ముస్తాబౌతున్న తర్తూరు గ్రామం







- జాతరకు ప్రత్యేక ఆకర్షణ వృషభల పోటీలు
- ఉయ్యాలలు రైతు సామాగ్రి బొమ్మల దుకాణాలు
- శ్రీ రంగనాథ స్వామి ఆలయ కమిటీ,ఆధ్వర్యంలో
- వచ్చే భక్తులకు,మొక్కులు తీర్చుకోవడానికి అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేస్తున్నాం
- ఈవో సాయికుమార్

**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** శ్రీశ్రీశ్రీ లక్ష్మి రంగనాథుడి జాతరకం ముస్తాబోతున్న తర్తూర్ గ్రామం.. స్వస్తిశ్రీ పరాభరణం సంవత్సరం చైత్రమాసంలో ఉగాది రోజు గ్రామ దేవత పూజతో 26327 శుద్ధ అష్టమి గురువారం నుండి 4426 చైత్ర బహుళ విధినయ శనివారం వరకు రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు మొక్కులు చెల్లించుకుంటూ సింహం సేవ, హంస వాహన సేవ, శేష వాహన సేవ, హనుమద్ వాహన సేవ, గరుడ వాహన సేవ, ద్విమంగళ రథోత్సవం, అశ్వవాహన సేవ (పరువేట), వసంతోత్సవం తీర్థ వలి సేవలు స్వామికి జనరంజకంగా అతి పురాత కాలం నుండి జరుగుతుంది. శ్రీ శ్రీ శ్రీ లక్ష్మి రంగనాథ స్వామి క్షేత్రం తర్తూరు గ్రామం జూపాడు బంగ్లా మండలం నందికొట్కూరు నియోజకవర్గం నంద్యాల జిల్లా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం,రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద జాతరగా ప్రసిద్ధి చెందినది. ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో స్వామివారి బ్రహ్మోత్సవాలు గ్రామ పెద్దలు ప్రజలు కుల మతాలకు అతీతంగా జాతర జరుపుకుంటారు.ఈ జాతరకు తెలుగు రెండు రాష్ట్రాల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులతో జనరంజకంగా సాగుతుంది.

**స్వయంభుగా వెలసిన స్వామి ఎలా కొలువు తీరారు**

పూర్వం తర్తూరు గ్రామానికి చెందిన ఒక మహిళను శ్రీరంగాపురం గ్రామం ప్రస్తుత వనపర్తి జిల్లా , తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఒక వ్యక్తితో వివాహం జరిగింది. అత్తింటి ఆడపడుచులు ఆమెకు ఒడి బియ్యంతో ఒక బొమ్మను పెట్టారు.తర్వాత మహిళ తన పుట్టినిల్లు అయిన తత్తూరు గ్రామానికి చేరుకున్న సమయంలో ఆ బొమ్మ కాస్త ఒక శిలగా మారింది,ఆశ్చర్యపోయిన మహిళ ఈ శిల నా ఒడిలోకి ఎలా వచ్చింది అనుకొని తన గృహంలోని ఒక గాడిపాడులో పారవేసింది.దీంతో ఆ శిల కాస్త అలాగే నిలిచిపోయి శ్రీ లక్ష్మీ సమేత తర్తూరు రంగనాథ స్వామిగా కొలువై నేటికీ భక్తులచే విశేష పూజలందుకుంటున్నారు. శ్రీ లక్ష్మీ రంగనాథ స్వామి జాతర చాలా ప్రసిద్ధి, కొన్ని వందల సంవత్సరాల నుండి ఎనిమిది రోజుల పాటు అత్యంత వైభవంగా సాగే ఈ జాతరలో పూల చప్పరం,రథోత్సవం,వృషభాల పోటీలు ఉయ్యాలలు రైతు సామాగ్రి, బొమ్మల అంగళ్లు ప్రత్యేక ఆకర్షణ.ఈ జాతర గ్రామ సర్పంచ్,శ్రీ రంగనాథ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఈవో సాయి కుమార్,పర్యవేక్షణలో గ్రామ పెద్దల ప్రజలతో మరియు భక్తుల అత్యంత వైభవంగా జరుగుతుంది.

# గొప్ప దైవ భక్తుడు ఎమ్మెల్యే జీఎంఆర్

- పటాన్ చెరు ఏపీఆర్ లో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ విశాలక్ష్మి సమేత కాశీ విశ్వనాథ స్వామి, శ్రీ సీతా సమేత కోదండ రామచంద్రస్వామి ఆలయానికి 75 లక్షల భారీ విరాళం
- నేటి వరకు సొంత నిధులతో 210 కు పైగా దేవాలయాల నిర్మాణం
- ప్రతి ఒక్కరిలో భక్తి భావం, మతసామరస్యాన్ని పెంపొందించడమే మా లక్ష్యం
- ఎమ్మెల్యే జీఎంఆర్



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** ఒక వైపు అభివృద్ధిలో మరో వైపు ఆధ్యాత్మికలో పటాన్ చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రతీకగా నిలుపుతూ నేటితరం రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తున్నారు పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి. నియోజకవర్గంలో ఏ గ్రామంలోనైనా గుడి, మసీదు, చర్చి నిర్మిస్తే తన వంతు సహకారాన్ని అందిస్తూ ప్రతి ఒక్కరిలో భక్తి భావాన్ని పెంపొందిస్తున్నారు. తాజాగా పటాన్ చెరు ఏపీఆర్ లో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ విశాలక్ష్మి సమేత కాశీ విశ్వనాథ స్వామి, శ్రీ సీతా సమేత కోదండ రామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి 75 లక్షల రూపాయల భారీ విరాళం అందించారు. శనివారం ఆలయంలో ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్ తన కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు.గతంలో ఇచ్చిన హామీ మేరకు 75 లక్షల రూపాయల విరాళానికి సంబంధించిన చెక్కులను ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమాజంలో మతాలు వేరైనా మనుషులందరూ ఒక్కటేనని.. మానవత్వం, ప్రేమ, శాంతి, మరియు సోదరభావం మతాల మూల సూత్రమని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ధర్మాన్ని కాపాడుకుంటూ పరమత సహనాన్ని పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే గత 20 సంవత్సరాలుగా పటాన్ చెరు నియోజకవర్గం వ్యాప్తంగా సొంత నిధులతో 210 కి పైగా దేవాలయాలు,వందకు పైనా మసీదులు,ఆశిర్ఖానాలు,30 కి పైగా చర్చిలు నిర్మించి పరమత సహనానికి ప్రతీకగా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు. దైవం పట్ల అచంచల విశ్వాసం, నిష్కామ కర్మ, మరియు క్రమశిక్షణతో కూడిన జీవనం ప్రతి ఒక్కరిలో భక్తి భావాన్ని పెంచుతాయని అన్నారు.కుల,మత,వర్గ విభేదాలను మర్చిపోయి,మానవుడిగా ప్రతి ఒక్కరూ సన్మార్గాన్ని అనుసరించడమే నిజమైన భక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి,సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్,మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వెంకట్ రెడ్డి,భాస్కర్ రెడ్డి,చిన్న మధు, ప్రభాకర్, సందీప్ రెడ్డి,అశోక్,వెంకటేష్,రాజు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కోటగిరిలో కుస్తీమల్ల యోధుల పోటా పోటీ





- ఆకట్టుకున్న ఢిల్లీ యువతి బల్జీత్ కౌర్ కుస్తీ
- మీది గల్లి ఆధ్వర్యంలో కుస్తీ పోటీల నిర్వహణ
- శ్రీరామనవమి సందర్భంగా కొనసాగుతున్న కుస్తీ పోటీల ఆనవాయితీ

**కోటగిరి,దీక్ష ప్రభ:** శ్రీ రామ నవమి పండుగను పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో మీదిగల్లీ ఆధ్వర్యంలో గౌడ కులస్తుల సహకారంతో శుక్రవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మారుతి పటేల్ గ్రామ పెద్దలతో కలిసి మీది గల్లి హనుమాన్ మందిర్ నుండి కుస్తీ పోటీలు నిర్వహించే ప్రాంగణం వరకు భాజా భజంత్రీలతో ర్యాలీగా వెళ్లి కొబ్బరికాయను కొట్టి కుస్తీ పోటీలను ప్రారంభించారు.ఈ కుస్తీ పోటీలు 20 రూపాయలతో మొదలుకొని రూ.2వేల రూపాయల వరకు కొనసాగాయి.ఈ కుస్తీ పోటీలో కోటగిరి ఎస్సై సునీల్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కుస్తీ పోటీలో కోటగిరి గ్రామ చుట్టు ప్రకల గ్రామాలతో పాటు మహారాష్ట్ర,ఢిల్లీ రాష్ట్రాలనుండి సైతం మల్ల యోధులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ఆధ్యంతం కుస్తీ పోటీలు రసవత్తరంగా కొనసాగాయి.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మీడియాతో మాట్లాడుతూ..ప్రతిసారి లాగానే ఈసారి కూడా శ్రీ రామ నవమి పండుగ సందర్భంగా మీది గల్లీ ఆధ్వర్యంలో గ్రామంలో కుస్తీ పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కుస్తీ పోటీల్లో కోటగిరి మండలంతో పాటు చుట్టుపక్కల మండలాలు, మహారాష్ట్ర,ఢిల్లీ నుండి సైతం కుస్తీ వీరులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారని చెప్పారు. శ్రీరామనవమి పండుగ నాడు గ్రామంలో మీది గల్లి వాసులంతా కలిసి గౌడ కులస్తుల సహకారంతో కుస్తీ పోటీలు నిర్వహించడం అనవాయితీగా కొనసాగుతుందని అన్నారు. తమ గ్రామంలో నిర్వహించే కుస్తీ పోటీల్లో పాల్గొని విజయవంతం చేస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మారుతి పటేల్, తేల్ల రవికుమార్, మామిడి కిషన్, అమ్మాని విఠల్ పటేల్, మామిడి అశోక్, ఏముల కాశీరాం,తేల్ల చిన్న అరవింద్, మామిడి సాయిలు, గర్దాస్ ఆనంద్, మామిడి సాయి ప్రసాద్, రుద్రంగి సందీప్, డాన్ రాజు,వార్డు సభ్యులు పత్తి అబ్బయ్య,కాసుల శ్రీకాంత్, మామిడి లింగురాం, తేల్ల శ్యామ్, మామిడి శ్రీనివాస్ మామిడి సతీష్,ఎడ్డెడి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ జిల్లా మహాసభల కరపత్రాల విడుదల

- కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు కోసం పోరాడాలి
- వి.రఘురాం మూర్తి పిలుపు



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** ఏప్రిల్ 6, 7 తేదీలలో నందికొట్కూరులో నిర్వహించనున్న ఏఐటీయూసీ నంద్యాల జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం పగిడ్యాల మండల కేంద్రంలో కరపత్రాలను విడుదల చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వి. రఘురాం మూర్తి ఆధ్వర్యంలో జరిగింది . వారు మాట్లాడుతూ..లేబర్ కోర్స్ రద్దు చేయాలని,రాష్ట్ర ప్రభుత్వం పని గంటలను 8 నుండి 10 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడం దారుణమని అన్నారు. 55 సంవత్సరాలు కలిగిన హమాలీ కార్మికులకు సామాజిక పింఛన్ ఎనిమిది వేలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కార్మిక నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎ.ఐ.టి.యు.సి మండల నాయకులు చాంద్ భాష,కళ్యాణ్, అబ్దుల్ రెహమాన్,దేవన్న, శాలు భాష తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛమైన గాలిని భావితరాలకు బహుమతిగా అందిద్దాం

- మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి
- మున్సిపాలిటీలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** స్వచ్ఛమైన గాలితో మనం ఆరోగ్యకరంగా జీవన ప్రయాణం కొనసాగించవచ్చని.. ఆరోగ్య ఆంధ్ర దిశగా అడుగులు వేస్తూ కాలుష్య కట్టడికి సమష్టిగా కృషి చేద్దామని నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారంస్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్రలో భాగంగానందికొట్కూరు మున్సిపాలిటీలో వివిధ శాఖల అధికారులతో సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం అధికారులతో ప్రత్యేకంగా ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర 2047 సాకారానికి ముందడుగుగా ప్రతిఒక్కరూ స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్రకు కృషిచేయాల్సిన అవసరముందని..ప్రజారవాణా వ్యవస్థను ఉపయోగించడం, విస్తృతంగా మొక్కలు నాటడం,సౌర విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించడం, పరిశ్రమల్లో కాలుష్యాన్ని తగ్గించే విధానాలను అనుసరించడం, పంట అవశేషాల్ని కాల్చకుండా నివారించడం వంటివి పాటించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా ఈ రోజు క్లీన్ ఎయిర్ (స్వచ్ఛమైన గాలి) ఇతివృత్తంతో కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు వివరించారు. మన దైనందిన జీవితంలో పర్యావరణహిత మార్గాలను అనుసరించడం ద్వారా మన భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అత్యంత విలువైన బహుమతిగా అందిద్దామని కమిషనర్ జి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు మెక్మా అధికారులు పొదుపు సంఘం ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఘనంగా ప్రారంభించిన టిడిపి సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి

- ముఖ్య అతిథులు రూరల్ సీఐ టీ.సుబ్రహ్మణ్యం
- జూపాడు బంగ్లా ఎస్ఐ మల్లికార్జున



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు నియోజకవర్గం జూపాడుబంగ్లా మండలం తుడిచెర్ల గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా ఉమ్మడి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ పోటీలను టిడిపి సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నందికొట్కూరు సి.ఐ టీ.సుబ్రహ్మణ్యం, జూపాడుబంగ్లా ఎస్సై మల్లికార్జున హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు క్రీడ మైదానంలో పోటీ తత్వంతో ఆడి, గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని, క్రీడలు మనసుకు ఉల్లాసాన్ని, ఉత్తేజాన్ని ఇస్తాయని ప్రత్యేకంగా గ్రామాలలో కబడ్డీ పోటీలు అంటే ఒక ప్రత్యేకత ఉందని, ఈ కబడ్డీ పోటీలకు ప్రతి ఒక్కరూ పిల్లలు పెద్దలు ఆదరిస్తారని, అనిఅన్నారు. కబడ్డీ ప్లేయర్స్ ల ను మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, రూరల్ సి.ఐటి.సుబ్రహ్మణ్యం, జూపాడు బంగ్లా ఎస్ఐ మల్లికార్జున, కబడ్డీ ప్లేయర్స్ లతో పరిచయం చేసుకొని వారికి ఆల్ ది బెస్ట్ చెప్పారు.ఈ కార్యక్రమంలో దొడ్డ సుధాకర్, రాముడు, బాల మద్దయ్య, బాలకృష్ణుడు,నరసింహుడు, పద్మనాభం,తెలుగు లక్ష్మయ్య, హనుమంతు,సాయిబాబా,జనసేన ప్రదీప్ కుమార్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.



# శ్రీరాముడిలా బతికినప్పుడే మన జన్మకు సార్థకత

- ప్రతి ఒక్కరూ శ్రీరాముడిలా త్యాగం
- ఓర్పు, క్రమశిక్షణ వంటి గుణాలను కలిగి ఉండాలి
- తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి
- కోటగిరిలో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన పోచారం సురేందర్ రెడ్డి



**కోటగిరి, దీక్ష ప్రభ:** ఉమ్మడి కోటగిరి మండలంలో శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కోటగిరి మండల కేంద్రం తోపాటు ఎక్లాస్ పూర్ క్యాంప్, కొత్తపల్లి , రాంపూర్, ఎత్తుండా క్యాంపు, పోతంగల్, హంగర్గా, అడకాస్ పల్లి తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.శ్రీరామనవమి సందర్భంగా రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో ఉదయం సీతారాములకు సుప్రభాత సేవ, పల్లకి సేవ,సీతారాముల కళ్యాణం, అభిషేకం,అర్చన,తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పంపిణీ చేసిన పాణకం భక్తులు ప్రసాదముగా స్వీకరించారు. కోటగిరి మండల కేంద్రంతో పాటు ఎక్లాస్పూర్ రామాలయంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచారం సురేందర్ రెడ్డి సైతం శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ..దేవుడు ప్రతి ఒక్కరికి మానవజన్మ ఇచ్చినందుకు శ్రీరాముడిలా ఉత్తముడిగా బతకాలని శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరు త్యాగం ,ఓర్పు, క్రమశిక్షణ, గౌరవం,కృతజ్ఞత వంటి లక్షణాలను కలిగి ఉండాలని అన్నారు. దేవుడిచ్చిన జన్మలో మనిషి ఉత్తముడిగా బతికినప్పుడే ఈ జన్మకు సార్ధకత లభిస్తుందని ఆయన అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా తన స్వగ్రామమైన పోచారం గ్రామం, వర్ని మండల కేంద్రం, కోటగిరి మండల కేంద్రం, ఏక్లాస్పూర్, బాన్సువాడ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్నట్లు చెప్పారు. ప్రస్తుతం భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా హిందువులు అంతా కలిసి ఐకమత్యంగా జరుపుకుంటున్న గొప్ప పండుగ శ్రీరామనవమి అని చెప్పారు. శ్రీరాముడు లాంటి సద్గుణాలు కలిగిన వ్యక్తిని మనం భగవంతుడినిగా పూజించడం మన అదృష్టమని అన్నారు.ప్రపంచమంతా రామనామ జపం చేస్తుందంటే శ్రీరాముడి పై ఉన్న భక్తి భావమే అందుకు కారణమని అందుకే దేశమంతా ప్రస్తుతం రామనామ జపం చేస్తుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్ రెడ్డి,కోటగిరి మాజీ జడ్పిటిసి శంకర్ పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ గాయక్వాడ్ హనుమంతు, రామాలయం కమిటీ చైర్మన్ దమ్మలపాటి చౌదరి, ఎన్టీఆర్ అభిమానుల సంఘం అధ్యక్షుడు దొ ప్పలపూడి శ్రీధర్, విజయ డైరీ అధ్యక్షుడు ఉదయ్ భాస్కర్, పోతంగల్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు షాజీ పటేల్, ఎక్లాస్పూర్ గ్రామ సర్పంచ్ వెల్లంకి సీతా కుమారి రంగబాబు చౌదరి,ఉప సర్పంచ్ శ్రీకాంత్,మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, మాజీ సొసైటీ చైర్మన్ కూచి సిద్దు, మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్, వేములపల్లి ఆనంద్,నార్ల సాయి శ్రీనివాస్, కొల్లూరి రమేష్ బాబు,ఆయా గ్రామాల సర్పంచులు,గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

# పోతంగల్ లో తై బజార్ వేలం

- డైలీ మార్కెట్ రూ.1.50 వేలకు దక్కించుకున్న శెట్టి ప్రవీణ్
- వీక్లీ మార్కెట్ రూ.5.10 లక్షలకు దక్కించుకున్న సూదం గంగరాజు
- మేకల సంత రూ.7.70 లక్షలకు దక్కించుకున్న కన్నం రాము




**పోతంగల్,దీక్ష ప్రభ:** పోతంగల్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన తై బజార్ వేలం పాటలో మేకల సంత రికార్డు స్థాయి పలికింది. డైలీ మార్కెట్, వీక్లీ మార్కెట్, మేకల సంతకు గ్రామపంచాయతీలో సర్పంచ్ కల్లూరి సంధ్య,జిపి సెక్రెటరీ యాదవ్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో పలువురు పోటా పోటీగా పాల్గొనగా డైలీ మార్కెట్ ను శెట్టి ప్రవీణ్ రూ.1లక్షా 50 వేలకు దక్కించుకున్నారు. వీక్లీ మార్కెట్ ను సూదం గంగరాజు రూ.5 లక్షల 10 వేలకు దక్కించుకున్నారు. పోతంగల్ మేకల సంతను కన్నం రాము అనే వ్యక్తి రికార్డు స్థాయిలో రూ.7 లక్షల70 వేలకు వేలంపాటలో దక్కించుకోవడం స్తానికంగా చర్చనీయాంశంగా మారింది. వేలంపాటలో డైలీ వీక్లీ మార్కెట్లను, మేకల సంతను సొంతం చేసుకున్నవారు ముందుగా సగం డబ్బులను గ్రామపంచాయతీ చెల్లించాలని, మిగిలిన సగం డబ్బులకు దఫాల వారీగా చెల్లించేందుకు అగ్రిమెంటు చేసుకోవాలని జిపి సెక్రెటరీ యాదవ్ పేర్కొన్నారు. అగ్రిమెంట్ కు కావలసిన నోటరీ, ఖాళీ చెక్కులు,ఆధార్ కార్డు, తదితర సర్టిఫికెట్లు సకాలంలో గ్రామపంచాయతీ వారికి అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ కల్లూరి సంధ్య హనుమాన్లు, సెక్రటరీ యాదవ్,ఉప సర్పంచ్ నబి,గ్రామ పెద్దలు,యువకులు,జిపి సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**నర్సింహులపేట,దీక్ష ప్రభ:** ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరమని సర్పంచ్ అజ్మీర సత్తి శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని జగ్గు తండాలో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచందర్ నాయక్ సహకారంతో బాధితులకు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అజ్మీరా రవి నాయక్, గ్రామపార్టీ అధ్యక్షుడు వీరు నాయక్, వార్డు సభ్యులు ప్రేమ్ కుమార్, మాజీ సర్పంచ్ హోలీ నాయక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవింగ్ వృత్తిలో కంటి చూపు కీలకం: ఎస్ఐ

**నర్సింహులపేట,దీక్ష ప్రభ:** డ్రైవింగ్ వృత్తిలో కంటి చూపు చాలా కీలకమైనదని, డ్రైవర్ కంటి చూపు బాగా ఉంటేనే వాహనాన్ని సమర్ధవంతంగా నడపగలుగుతాడని ఎస్ఐ మాలోతు సురేష్ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో సాయి సిరి ఆప్టికల్స్, శరత్ మాక్స్ విజన్ ఐ కేర్ హనుమకొండ సహకారంతో శనివారం ఉచిత కంటి పరీక్షలను నిర్వహించారు. అనంతరం 130 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి దగ్గరి చూపుఉన్నా 40 మందికి కంటి అద్దాలను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. వయస్సు పెరిగే కొద్ది కంటి చూపు మందగించడం సహజమని, క్రమం తప్పకుండా కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకుని తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది బాలాజీ, వెంకన్న,తిరుమలేష్, వైద్య సిబ్బంది ఎనగందుల సంతోష్ కుమార్ నవీన్ జీవన్ మహేందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



# నృత్యాన్ని వేదిక ప్రభావితం చేస్తుంది

- నృత్యానికి, స్థలానికి మధ్య సంబంధాన్ని విశ్లేషించిన డాక్టర్ మల్లాది సంప్రీతి



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** నృత్యం యొక్క శారీరక సౌందర్యం నిర్మిత రూపంతో లోతుగా ముడిపడి ఉందని, ఇక్కడ వేదిక కొలతలు, అనుభవపూర్వక అమరికలు ప్రదర్శనను గణనీయంగా ప్రభావితం చేస్తాయని వివిధ రంగాలలో నిష్ణాతురాలు, కళాకారిణి డాక్టర్ సంప్రీతి మల్లాది వెల్లడించారు. హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్)లోని లలిత, ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో 'అంతరిక్షంలోనా లేక వేదికపైనా? భారతీయ నర్తకుల ప్రదేశాల ప్రతిధ్వనులను అన్వేషించడం' అనే అంశంపై శనివారం ఆమె ఆతిథ్య ఉపన్యాసం చేశారు. తన ఉపన్యాసంలో డాక్టర్ మల్లాది భారతీయ ప్రదర్శన సంప్రదాయాలపై తాను చేసిన విస్తృత పరిశోధన ఆధారంగా, నృత్యానికి, స్థలానికి మధ్య పరిణామం చెందుతున్న సంబంధాన్ని విశ్లేషించారు. ప్రాదేశిక సందర్భాలు శారీరక అభ్యాసాలను ఎలా రూపొందిస్తాయో, వాటిచే ఎలా ప్రభావితమవుతాయో ఆమె వివరించారు. ఈ క్రమంలో, వేదిక గురించిన సాంప్రదాయ అవగాహనను మించిన ఒక దృక్కోణాన్ని ఆమె అందించారు. వాస్తు పరమైన స్థలాలు చట్టబద్ధతను కల్పించే శక్తులుగా పనిచేస్తాయని, చారిత్రాత్మకంగా, నృత్యం, ప్రాదేశిక రూపకల్పనల సమ్మేళనం వాస్తుశాస్త్ర పరిణామంలో అంతర్భాగంగా ఉందని డాక్టర్ మల్లాది పేర్కొన్నారు. నృత్యం, ప్రదేశానికి సంబంధించిన భావనాత్మక, సాహిత్యపరమైన వ్యాఖ్యానాలు, జీవన, తాత్కాలిక ఆచరణలతో నిరంతరం సంభాషిస్తూనే ఉన్నాయన్నారు. ఇవి తరచుగా సంస్థాగత, ప్రభుత్వ ప్రయోజనాలతో ముడిపడి, వాటిచే నియంత్రించబడతాయని పేర్కొన్నారు. ప్రొసీనియం వేదిక దూరం, దృశ్యమానత, హావభావాలను పునర్ నిర్వచించినట్టే, సాంప్రదాయ సభలు కూడా ప్రదర్శకులను, ప్రదర్శనలను తీర్చిదిద్దిన సాంస్కృతిక సంరక్షకులుగా వాటి పాత్రను డాక్టర్ మల్లాది మరింతగా వివరించారు. ఈ చర్చను డిజిటల్ యుగానికి విస్తరిస్తూ, నేటి దృశ్యమానత అనేది అల్గారిథమిక్ విస్తరణ, దృశ్య ఆకర్షణ, పునరావృతమయ్యే స్వభావం, ప్లాట్ ఫామ్ సౌందర్యం వంటి వాటిచే ఎక్కువగా నియంత్రించబడుతోందని, తత్ఫలితంగా కొన్ని అత్యంత స్పష్టంగా కనిపిస్తుండగా, మరికొన్ని అట్టడుగున ఉండిపోతున్నాయని ఆమె గమనించారు. ఈ కార్యక్రమాన్ని లలిత, ప్రదర్శన కళల విభాగం సమన్వయకర్త డాక్టర్ వై. లలిత సింధూరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు ఆఫ్ లైన్, ఆన్ లైన్ (హైబ్రిడ్) పద్ధతిలో చురుకుగా పాల్గొన్నారు. ఇది ప్రదర్శన, ప్రాదేశిక అధ్యయనాల సంగమంతో బలమైన విద్యాపరమైన అనుబంధాన్ని ప్రతిబింబించింది.

# వారాహి సిల్వర్ జ్యువెలరీ ఘనంగా ప్రారంభం



**హైదరాబాద్, దీక్ష ప్రభ:** తమ వ్యాపార ప్రయాణంలో మరో ముఖ్యమైన మైలురాయిగా, ప్రముఖ వ్యాపారవేత్తలు మనీదీప్ యేచూరి, డా. స్పందన మద్దుల శనివారం కూకట్‌పల్లి ప్రాంతంలో వారాహి సిల్వర్ జ్యువెలరీని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై తేజ సజ్జ, మీనాక్షి చౌదరి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఇప్పటికే ఐదు విజయవంతమైన స్టోర్లతో వారాహి సిల్క్స్ ద్వారా బలమైన గుర్తింపును సంపాదించిన సంస్థ, ఇప్పుడు తమ తొలి ప్రత్యేక సిల్వర్ జ్యువెలరీ షోరూమ్‌తో ఈ విభాగంలోకి అడుగుపెడుతోంది. బంగారం వ్యాపార రంగంలో 15 ఏళ్లకు పైగా అనుభవం కలిగిన మనీదీప్ యేచూరి, జ్యువెలరీ వ్యాపారంలో సంప్రదాయ వారసత్వం కలిగిన కుటుంబం నుంచి వచ్చి, ఈ రంగంలో ప్రముఖుడిగా నిలిచారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు మాట్లాడుతూ.., అత్యుత్తమ నైపుణ్యం, ప్రత్యేక డిజైన్లు, సరసమైన ధరల సమ్మిళితంగా ప్రీమియం సిల్వర్ జ్యువెలరీకి ఒకే చోట అందించే లక్ష్యంతో ఈ బ్రాండ్‌ను ప్రారంభించామని తెలిపారు. ప్రస్తుతం బంగారం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో, అద్భుతమైన వధూవరాల ఆభరణాలను ధరించాలనే వినియోగదారుల ఆకాంక్షలను తీర్చేందుకు, సిల్వర్‌లో అదే వైభవం మరియు లగ్జరీని అందించే ప్రత్యామ్నాయాలను ఈ బ్రాండ్ అందిస్తోంది. దీనివల్ల వినియోగదారులు డిజైన్ లేదా అందాన్ని తగ్గించుకోకుండా, అందుబాటు ధరలో సంప్రదాయ వధూవరాల ఆభరణాలను ఆస్వాదించవచ్చు. సున్నితమైన ముక్కుపుడకల నుంచి గ్రాండ్ బ్రైడల్ సెట్ల వరకు, ప్రతి అవసరానికి అనుగుణంగా విభిన్న ఆభరణాలు ఇక్కడ లభిస్తాయి. అయితే, ఈ బ్రాండ్ యొక్క ప్రధాన ప్రత్యేకత డిజైనర్ మరియు స్టేట్‌మెంట్ బ్రైడల్ జ్యువెలరీ, ఇది అద్భుతమైన విలువతో లగ్జరీ లుక్‌ను అందిస్తుంది.

# శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న కోటగిరి ఎస్ఐ దంపతులు



**కోటగిరి,దీక్ష ప్రభ:** కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ రామాలయంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో కోటగిరి ఎస్సై సునీల్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో ఐదు జంటలతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించగా అందులో కోటగిరి ఎస్ఐ సునీల్ దంపతుల జంట పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరాముని కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని కోటగిరి మండలం సుఖ శాంతులతో,పాడిపంటలతో విరాజిల్లాలని కోరారు.

# కారేగాంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు



**పోతంగల్,దీక్ష ప్రభ:** పోతంగల్ మండలం కారేగాం గ్రామంలో మూడు నెలల వయసు గల ఆవు,గేదె జాతి పశువులకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటు వ్యాధినిరోధక టీకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ నరహరి సురేష్ ముఖ్యఅతిగా హాజరై ప్రారంభించారు. పశువైద్యలతో కలిసి పశువులకు గాలికుంటు నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సునీల్,ఉప సర్పంచ్ సతీశ్,సిబ్బంది సుధీర్ గౌడ్,అటెండర్లు లక్ష్మి,భూమేష్,భాస్కర్,సతీశ్,గోపాల మిత్ర రియాజ్,పశుమిత్ర రాజేశ్,పశు పెంపకందార్లు పాల్గొన్నారు.

# కొండగట్టుకు యువ స్వాముల పాదయాత్ర

- పోతంగల్ మండలం కల్లూరు గ్రామం నుండి పాదయాత్రగా బయలుదేరిన హనుమాన్ స్వాములు
- పాదయాత్ర చేస్తున్న వారిని సన్మానించిన గ్రామ పెద్దలు యువకులు

**పోతంగల్,దీక్ష ప్రభ:** పోతంగల్ మండలం కల్లూరు గ్రామ ఆంజనేయ మాలధారణ స్వాములు కొండగట్టు అంజన్న క్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరారు.యువ స్వాములకు గ్రామస్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పాదయాత్రగా కొండగట్టుకు వెళ్తున్న యువ స్వాములను గ్రామ పెద్దలు, మిత్రులు పూలమాలలతో సత్కరించి, వారి యాత్ర దిగ్విజయంగా సాగాలని ఆకాంక్షించారు. 41 రోజుల హనుమాన్ దీక్ష అనంతరం భక్తిశ్రద్ధలతో, నియమ నిష్టలతో ఈ పాదయాత్రను చేపట్టిన యువ స్వాములనున గ్రామస్తులు అభినందించారు. హనుమంతుని ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, యువకులు క్షేమంగా యాత్ర ముగించుకుని తిరిగి రావాలని గ్రామస్థులు కోరుకున్నారు.ఈ కార్యమంలో గ్రామ పెద్దలు హనుమాన్ మాలధారణ స్వాములు,స్వాముల తల్లిదండ్రులు, యువకులు పాల్గొన్నారు.



# వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి

**- బిజెపి బాన్సువాడ నియోజకవర్గ నాయకులు కోనేరు శశాంక్**



**కోటగిరి,దీక్ష ప్రభ:** బాన్సువాడ నియోజకవర్గంలో వరి కోతలు ప్రారంభమైనందున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని బిజెపి బాన్సువాడ నియోజకవర్గ నాయకులు కోనేరు శశాంక్ డిమాండ్ చేశారు. శనివారము ఉమ్మడి కోటగిరి, రుద్రూర్ మండలాల్లో వరి పంట కోసిన రైతులను కోనేరు శశాంక్ స్థానిక నాయకులతో కలిసి మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కోటగిరి బిజెపి పార్టీ మండల అధ్యక్షులు ఏముల నవీన్ మాట్లాడుతూ..వరి కోతలు ప్రారంభమైననా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు వరి పంటను వాతావరణ పరిస్థితులు బాగా లేకపోవడం వల్ల దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారని,దళారులు ఇదే అదునుగా భావించి రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కొన్నిచోట్ల అకాల వర్షాల వల్ల రైతులు పంట నష్టపోవడం జరిగిందని దీనికి తోడు ఇప్పుడు దళారులు కూడా రైతులను దోచుకుంటున్నారని అన్నారు . ప్రభుత్వం స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి రైతులను ఆదుకోవాలని కోరారు.అదేవిధంగా బిజెపి నాయకులు కోనేరు శశాంక్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని వెంటనే రైతు భరోసా డబ్బులు మొత్తం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వరి కోతలు ప్రారంభమైనందున వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని బాన్సువాడ ఎమ్మెల్యే ఎమ్మెల్యేను,రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట కోతలకు వచ్చిన ఇప్పటివరకు రైతు భరోసా నిధులు రైతులకు ఇవ్వకపోవడం పై కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డారు. ఎన్నికల్లో గెలిచాక ఇప్పటికే రైతు భరోసా ఇవ్వకుండా రైతులను మోసం చేసుకుంటూ వచ్చారని ఇప్పటికైనా రైతులకు బకాయి పడ్డ రైతు భరోసా డబ్బులను వెంటనే వారి అకౌంట్లో వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులే బుద్ధి చెబుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, బీజేపీ కోటగిరి మండల అధ్యక్షులు ఏముల నవీన్, రుద్రూర్ మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, నియోజకవర్గ సీనియర్ నాయకులు మర్కెల్లి ప్రకాష్ పటేల్, వడ్లసాయినాథ్, గుంజరి జగదీష్, కమ్మరి శివశంకర్,మామిడి శ్రీనివాస్,సాయిలు, సీనియర్ నాయకులు జిలకరి విజయ్, గణేష్ పటేల్, కార్యకర్తలు పాల్గొన్నారు.



Printed,Published,Edited, & owned by **Rathod Vinod Kumar** Published from **SNEHITHA PUBLICATIONS** Falcon Printing press, # 1-2-201,Shop No.2,Khan Street Zaheerabad Town,Sangareddy District,Telangana State pin code :502220, Printed At Falcon Printing Press # 1-2-201,Shop No.2,Khan Street Zaheerabad Town,Sangareddy District,Telangana State pin code: 502220, Editor: **Rathod Vinod Kumar**. RNI NO. TELTEL/2023/87655,Cell : 9550021491,7893532721, Gmail: deekshaprabhatelugudaily@gmail.com